క్లుప్తంగా

పుణ్యక్షేత్రాల్లో నృత్య ప్రదర్శనలకు ఒంగోలు విద్యార్థులు

ఒంగోలు మెట్రో: భారతదేశంలోని రెండు ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య ప్రదర్శనల కోసం ఒంగోలుకు చెందిన శ్రీ నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్ విద్యార్థులకు అవకాశం లభించింది. ఆ మేరకు సంబంధిత నిర్వాహకులు ఆహ్వానం పంపారు. గురుపూర్ణిమ సందర్భంగా ఈ నెల 15, 16 తేదీల్లో మహారాష్ట్రలోని షిర్డీ సంస్థాన్ వారు శ్రీ షిర్డీ సాయి దివ్య చరితం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. అదేవిధంగా కంచి కామకోటి పీఠాధిపతులు, శ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి చాతుర్మాస దీక్ష ప్రారంభ సందర్భంగా తమిళనాడు, కాంచీపురం పట్టణంలోని ఒరిక్కై మండపంలో 24వ తేదీ స్వామివారి సమక్షంలో శ్రీ నళినీ ప్రియ కూచిపూడి నృత్య నికేతన్ విద్యార్థులు శ్రీ శంకర విజయం కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శిస్తారు. ఇటువంటి రెండు గొప్ప అవకాశాలు లభించినందుకు నృత్య దర్శకురాలు, సంస్థ నిర్వాహకురాలు ఎస్వీ శివకుమారి సంతోషం వ్యక్తం చేశారు. తెలుగువారి ప్రాముఖ్యమైన కూచిపూడి నృత్య కళకు తమ వంతు సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమెను నగరానికి చెందిన వివిధ కళా సంస్థల వారు అభినందించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు



పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



అల్లూరి పోలేరమ్మ అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణం, పరిసర ప్రాంత ప్రజల గ్రామ ఇలవేల్పు అయినటువంటి శ్రీ అల్లూరి పోలేరమ్మ తల్లిని ఆదివారం సందర్భంగా పెద్దఎత్తున దర్శించు కోవడం ప్రజల ఆనవాయితీగా మారింది. పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ బండ్లతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్టలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ హోమం



హనుమత్ హోమంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీగిరి క్షేత్ర పాలకుడు శ్రీ అభయాంజనేయస్వామివారి 54వ ఆగమన ఆరాధనోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అభయాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో హనుమత్ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. విష్ణు సహస్ర నామ పారాయణలో పలువురు భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేటి కార్యక్రమాలు...

అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధన ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు ప్రముఖ హనుమత్ ఉపాసకుడు డాక్టర్ పరాంకుశకేశవాచార్యులచే సుందరకాండ పారాయణ కార్యక్రమం జరుగుతుందని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు తెలిపారు.

హోరాహోరీగా ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు ట్రోఫీలు అందిస్తున్న అద్దంకి మురళీకృష్ణ, తదితరులు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలు ఆదివారంతో ముగిశాయి. విజేతలకు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ ట్రోఫీలు అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరూ భవిష్యత్తులో జరిగే పోటీల్లో మరింతగా సత్తాచాటేందుకు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి, కార్యదర్శి విజయ్, రవిబాబు, రఘు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా శ్రీహరి



అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీహరి

ఒంగోలు: లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా చలువాది శ్రీహరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మౌర్యా గ్రాండ్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ 38వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ సేవలు విస్తృతం చేయడం ద్వారా క్లబ్ ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు కార్యవర్గంలోని ప్రతిఒక్కరి సహకారంతో కృషి చేస్తామన్నారు. ఆత్మీయ అతిథిగా శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ క్లబ్ ఇప్పటి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించిందని, నూతన పాలకవర్గం ఆ బాధ్యతను మరింత ఇనుమడింపజేయాలని సూచించారు. అనంతరం కార్యదర్శిగా పబ్బిశెట్టి రాజేష్, కోశాధికారిగా కుమారస్వామి ప్రమాణస్వీకారం చేశారు. కీనోట్ స్పీకర్‌గా కె.విజయ్‌చందు, ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి, ఇండక్షన్ ఆఫ్ న్యూ మెంబర్స్‌గా సీహెచ్ హరిప్రసాదరావు, నామినేని మోహన్‌రావు, శిద్దా సూర్యప్రకాశరావు, మాంటిస్సోరి ప్రకాష్‌బాబు, చిట్టెంరెడ్డి శ్రీనివాసరెడ్డి, నైనాల రామకృష్ణ, కూరపాటి రమేష్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు పువ్వాడ రాజేష్, తిరుపతిరెడ్డి, సోమినేని సురేష్, డీపీ రాఘవ, బొమ్మల శ్రీనివాసరావు, సిబి మైఖేల్ , క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యం ప్రమాదకరం

మార్కాపురం: పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి. శరత్ అన్నారు. మార్కాపురం పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పర్యావరణంపై రంగుల ప్లాస్టిక్ ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం వల్ల నమోదవుతున్న అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రపంచ దేశాలన్నీ అతలాకుతలం అవుతున్నాయన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, కరువుతో విలయతాండవం చేస్తున్నాయని తెలిపారు. ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వాయు, జల, భూగర్భ కాలుష్యం కాకుండా ప్రకృతిని భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. గాయత్రి, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు సయ్యద్ రఫీ, ఉదయగిరి వెంకట్రావు, మండల నాయకులు, ఆర్. విప్లవకుమార్, ఏనుగుల శివ, దూదేకుల రసూల్, మండ్ల శ్రీనివాసులు, వడ్డే రవికాంత్, సిఎల్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుండాల ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

నాగులుప్పలపాడు: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని కనగాల రామకృష్ణ అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉప్పుగుండూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి మొక్కను కనగాల కమలనాథం నాటడంతో పాటు గ్రామస్తులు సుమారు 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మొక్కల పెంపకంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామంలోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి ఒంగోలు బైపాస్ రోడ్డు వరకు ఇరువైపులా ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నం వెంకట్రావు, సామాజిక కార్యకర్త తెలగతోటి శ్యామ్యూల్, తూబాటి శ్రీకాంత్, భీమవరపు శివ, సాయి, గోగినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు, దుస్తుల పంపిణీ



దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఫ్యామిలీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: అభాగ్యులైన పలువురికి ఫ్యామిలీ క్లబ్ 34వ సమాజ సేవలో భాగంగా ఆదివారం దుప్పట్లు, దుస్తులు, ఆహారం అందించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు రెండు భాగాలుగా విడిపోయి ట్రంకు రోడ్డు, కలెక్టరేట్, లాయర్‌పేట, కేశవస్వామిపేట తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై, ఆలయాల వద్ద ఉంటున్న అభాగ్యులకు దుప్పట్లు, దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. మడనూరు గోశాలకు దానా పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీరరాఘవరావుతో పాటు టి.వెంకటేశ్వర్లు, కే సుబ్రహ్మణ్యం, కె.వి.సురేష్, టి.శ్రీను, సీహెచ్ శ్రీహరి, ఎస్.ఫణిరాజ్, కే బాలచంద్ర ప్రసాద్, టీవీ సురేష్, పి.విజయ్‌కృష్ణ, బీకేవీ రమేష్, కేవీ చంద్రమౌళి, అరవపల్లి మధు, కోట కిరణ్, సీహెచ్‌ఆర్ సుబ్రహ్మణ్యం, శ్రీను, ఎం.రామారావు, తాతా రామకృష్ణ, ఎన్వీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: కాపులందరూ ఐక్యంగా పనిచేసి ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నించాలని కాపు సంఘ నాయకులు పిలుపునిచ్చారు. కాపు సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్‌లో ఆదివారం ఒంగోలులోని అన్ని డివిజన్లలో ఇద్దరి చొప్పున కాపు సోదరులలో సమావేశం నిర్వహించారు. కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కాపు సంఘం నాయకులు తంజావూరు శ్రీనివాసరావు, గంది శ్రీనివాసరావు, వుమ్మిశెట్టి శ్రీనివాసరావు, రామ్‌రాజ్‌కుమార్, నరహరి, సాంబయ్య, తోటకూర చిన వెంకటరావు మాట్లాడుతూ ఐక్యంగా బలోపేతం కావడంతో పాటు ప్రతి ఒక్కరూ ఎదుటి వారికి సహాయం అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రతి డివిజన్‌లో 11 మందితో కమిటీ వేసి వారంలోగా కాపు సంఘం కార్యాలయానికి చేర్చాలని కోరారు. కొప్పోలు శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శివ, లింగంశెట్టి సుబ్బారావు, త్రిపురం శ్రీధర్, పూల శ్రీను, పసుపులేటి వాసు, పసుపులేటి నారాయణ, కోడే నాగరాజు, వాసాని అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల హర్షం



రహదారిపై నిలిచిన వర్షం నీరు



రోడ్డుపై నిలిచిన నీరు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో ఆదివారం ఉదయం నుంచి ఎడతెరపిలేని చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. గత 15 రోజులుగా వర్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పదును వర్షం పడగానే పత్తి, మిర్చి, కంది, సజ్జ, జొన్న తదితర పంటలన్నీ సాగుచేసుకునేందుకు పొలాలను సేద్యం చేసిపెట్టుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి మార్కాపురం, మార్కాపురం రూరల్, తర్లుపాడు, పెద్దారవీడు, కొనకనమిట్ల తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పట్టణంలోని పలు రోడ్లన్నీ వర్షపునీటితో నిండాయి. చిరువ్యాపారులు, పూలు, పండ్ల వ్యాపారులు ఎడతెరపిలేని వర్షపు జల్లులతో రోడ్లపై అమ్ముకోలేక ఇళ్లకే పరిమితమయ్యారు. ఇదే వర్షం కొనసాగితే పంటల సాగుచేపడతామని రైతులు చెప్పారు.

కొనకనమిట్ల: అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఓ మోస్తారు వర్షం కురిసింది. రెండు రోజులుగా కురిసిన చిరుజల్లులతో కూడిన వర్షానికి అర పదును వర్షం పడటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన సజ్జ, కంది, పత్తి పంటలకు వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మోస్తరు వర్షం పడటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. గొట్లగట్టు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద, ప్రధాన రహదారిపై నీరు చేరటంతో రాకపోకలకు కొంతసేపు ఇబ్బంది పడ్డారు. ఇంకో వర్షం పడితే దుక్కి దున్నని పొలాలు దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తామని రైతులు తెలిపారు.



గొట్లగట్టులో కురుస్తున్న వర్షం

అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం



వెలుగొండ్రాయునిపల్లిలో ఉత్సవ పీర్లు



అంకభూపాలెంలో పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

కొనకనమిట్ల: అత్యంత భక్తిశ్రద్ధలతో మొహర్రం పండగ నిర్వహించారు. మొహర్రం పండగను పురస్కరించుకొని ఆదివారం తెల్లవారు జామున చిన్న సరిగేసు ఉత్సవం జరిపారు. అలంకరించిన పీర్లతో ఉత్సవం చేస్తూ భక్తులు నైవేద్యాలు సమర్పించి భక్తిని చాటారు. మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, గనివానిపాడు, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిడీలను ముస్తాబు చేశారు. మంగళవారం రాత్రికి పెద్ద సరిగేసు ఉత్సవాలను, హోమా గుండాలు జరపడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పొదిలి: ఊరేగింపు ఉత్సవం నిర్వహించిన పీర్లు

పీర్ల చావిడిల వద్ద చిన్న షరగతు

పొదిలి: మొహర్రం పర్వదినంలో భాగంగా ఆదివారం పీర్ల చావిడిల వద్ద చిన్న షరగతు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా తూర్పుపాలెం, పడమర పాలెంలోని పీర్లను ప్రధాన వీధుల్లో ఊరేగింపు ఉత్సవం జరిగింది. పీర్లు వీధుల్లో ఊరేగింపు చేస్తున్న సమయంలో భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 16న పెద్ద షరగతు, 17న మొహర్రం సందర్భంగా పీర్ల ఊరేగింపు ఉత్సవాలు భారీగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆయా చావిడీల వద్ద పీర్ల గుండాలను ఇప్పటికే సిద్ధం చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

అర్ధవీడు (బేస్తవారిపేట): మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో ప్రారంభమయ్యాయి. అర్ధవీడు మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లె, బొల్లుపల్లి, అచ్చంపేట, దొనకొండ, పెద్దకందుకూరు, అయ్యవారిపల్లె, మొహిద్దీన్‌పురం, బోగోలు, నాగులవరం, కాకర్ల, మాగుటూరు, యాచవరం, రంగాపురం, వెలగలపాయ గ్రామాల్లో పీర్ల చావిడ్లను శుభ్రం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. చావిడ్లలో పీర్లకు పూజలు నిర్వహించారు. మంగళవారం పెద్దసరిగెత్తు, బుధవారం నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని ముజావర్లు తెలిపారు.

తుమ్మలచెరువులో...

తర్లుపాడు: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పీర్లపండుగకు ప్రసిద్ధిగాంచిన తుమ్మలచెరువులో ఆదివారం చిన్న షరిగత్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలో కొలువై ఉన్న స్వామివార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి స్వామివార్లను గ్రామంలో ఊరేగించారు. కులమతాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్దమొత్తంలో హాజరై మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. దర్గా కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో మంచినీరు, ఆహారం ఏర్పాటు చేశారు. ఈనెల 16న పెద్ద షరగత్ నిర్వహించనున్నారు. గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. సందర్భంగా ఎడ్ల పందేలు నిర్వహించనున్నారు.



గ్రామోత్సవంలో పెద్ద ఖాశీం స్వామి, చిన్న ఖాశీం స్వామి వార్లు

భక్త శ్రద్ధలతో యల్లమ్మ పూజలు

పుల్లలచెరువు: మండలంలోని ఉమ్మడివరంలో వేంచేసి ఉన్న యల్లమ్మ దేవరకు ఆదివారం ఆలయంలో పూజారి శంకు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమపూజ, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన



పూజల్లో మహిళలు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మి పద్మావతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మండలం రోజులు సామూహిక కోటి కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో పూజలు ఆదివారం నాటికి ఇరవై మూడో రోజుకు చేరాయి. ఉభయదాతలను ఆలయంలోకి ఆహ్వానించి, శాలువాలతో సత్కరిస్తున్నారు. వారిచే ప్రత్యేక పూజుల చేయిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అనంతరం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీకృష్ణమాచార్యులు, కార్యక్రమం నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, రామాపురం కోటేశ్వరరావు, పెరుమాళ్ళ భాస్కర్, మేడా నరసింహారావు, ఎస్.నాగేశ్వరరావు, మల్లయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ అమలు గెజిట్ ప్రతుల దగ్ధం

పొదిలి: రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ అమలుకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ, స్థానిక యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతులను ఆదివారం రాత్రి దగ్ధం చేశారు. విశ్వనాథపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని యూటీఎఫ్ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో జిల్లా కార్యదర్శి పి.బాలవెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కోరుతుంటే దానికి విరుద్ధంగా గెజిట్ విడుదల చేయడమేమిటని ప్రశ్నించారు. బ్యాక్ డేట్‌తో జీపీఎస్ అమలుకు రాజపత్రం విడుదల చేయటం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పిల్లి రమణారెడ్డి మాట్లాడుతూ 2023 అక్టోబర్ నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరినీ జీపీఎస్‌లోకి తెస్తూ రాజప్రతం విడుదల చేయటం ఈ వర్గాలను మోసపుచ్చడమేనన్నారు. పాత పెన్షన్ ఒక్కటే అంగీకారమన్నారు. జిల్లా సహాధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులు అందరినీ తిరిగి పాత పెన్షన్‌లోకి పునరుద్ధరించటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బూదాల బుజ్జిబాబు, పొదిలి మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల మండల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, మర్రిపూడి కార్యదర్శి కోటేశ్వరరావు, యూటీఎఫ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు బాలకాశిరెడ్డి, సింగంపల్లి సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, దేవప్రసాద్, గురవయ్య, పోలు శ్రీనివాసరెడ్డి, జూపల్లి వెంకటేశ్వర్లు, బీంపాటి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే ఖాశీం ,ఎం.శివారెడ్డి, కాట్రగడ్డ సుబ్బారావు, రమేష్‌రెడ్డి, గంట ఆంజనేయులు పాల్గొన్నారు.